## క్లుప్తంగా

### కొత్త పింఛన్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ద్రాక్షారామలో 60 మందికి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హసన్‌బాదలో నూతనంగా మంజూరు అయిన 19 మంది లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, పంచాయతీ కార్యదర్శి భాస్కరలక్ష్మి అందజేశారు.

### రిలేదీక్షలకు ముస్లింల మద్దతు

మండపేట: ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఐదో రోజుకు చేరాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి మద్దతు తెలుపుతూ శనివారం ముస్లింలు రిలేదీక్షలో పాల్గొన్నారు. షేక్ మౌలానా, షేక్ ఇబ్రహీం, ఎండీ కాదిరి, ఎండీ అల్తాఫ్, షేక్ మౌలాలి, ఎండీ షరీఫ్, ఎండీ నూర్, షేక్ జాబీర్, సల్మాన్ హుస్సేన్, షేక్ నభీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు

### పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి



రోగులకు మందులు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ బులిస్వామిరెడ్డి

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా గత రెండున్నర దశాబ్దాలుగా ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ట్రస్ట్ చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి అన్నారు. అర్తమూరులో శనివారం ట్రస్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 163వ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ గత పదమూడున్నర సంవత్సరాల కాలంగా ప్రతి నెల క్రమం తప్పకుండా అర్తమూరులో ఉచిత హోమియో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాల ద్వారా ప్రతి నెల అర్తమూరు, పరిసర గ్రామాలకు చెందిన 300 నుంచి 350 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేస్తున్నామని వివరించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్‌రెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, కోనాల సత్తిరెడ్డి, తాడి కోదండరామారెడ్డి, వెలగల శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ర్యాగింగ్ నిషేధంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏజీపీ మురళి

రామచంద్రపురం: మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధం అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్‌వెంకటరమణ మాట్లాడుతూ ర్యాగింగ్ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ వాసంశెట్టి రమణ, ప్రిన్సిపాల్ వి. ఝాన్సీలక్ష్మి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు

కె.గంగవరం: మండలంలో అముజూరు, కూళ్ల గ్రామ శివారు తమ్మయ్యపాలెంలో శనివారం పశుసంవర్ధన శాఖ ఆధ్వర్యంలో పారుడు వ్యాధి(పీపీఆర్) నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అముజూరు గ్రామ సర్పంచ్ నానాపరపు కల్యాణి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం పామర్రు పశువైద్యాధికారి బిందు పర్యవేక్షణలో రెండు గ్రామాల్లోను సుమారు 400 మేకలు, గొర్రెలకు పశువైద్య సిబ్బంది వ్యాక్సినేషన్ వేశారు.

### లింగాకర్షక బుట్టలతో ప్రయోజనం

రాయవరం: వరి పొలంలో లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వరిలో కాండం తొలుచు పురుగు రెక్కల పురుగులను ఆకర్షిస్తాయని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. సోమేశ్వరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రెక్కల పురుగులు లింగాకర్షక బుట్టల్లో పడడం వల్ల తల్లి పురుగులు నియంత్రించడంతో వాటి సంతతిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎటువంటి చీడపీడలు వస్తాయో వివరించారు. ముఖ్యంగా సుడిదోమ జీవిత చరిత్ర గురించి, నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### నేడు నూతన పింఛన్ల పంపిణీ

కె.గంగవరం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆదివారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా పంపిణీ చేస్తారన్నారు.

# వచ్చాడయ్యో.. సామీ..

- పూజలకు సిద్ధమైన వినాయక విగ్రహాలు
- రేపు మండపాల్లో కొలువుదీరనున్న గణపతి
- మండపేట నుంచి గ్రామాలకు తరలింపు

మండపేట: వినాయక చవితి వేడుకలకు గణనాథులు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాల్లో కొలువుదీరేందుకు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళుతున్నారు. మండపేటలోని ఆలమూరు, రామచంద్రపురం రోడ్డులలో రాజస్తాన్‌కు చెందిన కళాకారులు వినాయక ప్రతిమల తయారీ చేసి విక్రయిస్తున్నారు. గత కొద్ది నెలలుగా మూడు వందలకు పైగా ఐదు నుంచి 15 అడుగుల ఎత్తు కలిగిన విగ్రహాలను సిద్ధం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి హాని చేయని రంగులతో ముస్తాబు చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఉత్సవ కమిటీల సభ్యులు మండపేట వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో తమ ప్రాంతాలకు తరలించుకువెళుతున్నారు. సోమవారం వినాయక చవితి నేపథ్యంలో దూర ప్రాంతాలకు చెందిన వారు శనివారం విగ్రహాలను తీసుకువెళ్లగా మండపేట చుట్టుపక్కల గ్రామాల వారు ఆదివారం తీసుకువెళ్లనున్నట్టు తయారీదారులు తెలిపారు. పూర్తిస్థాయిలో విగ్రహాలన్ని అమ్ముడైతేనే తమ కష్టానికి ప్రతిఫలం ఉంటుందని వారు తెలిపారు.



వేడుకలకు ముస్తాబైన గణనాథులు



గణేశ్ విగ్రహం



వాహనాల్లో లోడింగ్ చేసేందుకు వినాయక విగ్రహాన్ని తీసుకువస్తున్న కార్మికులు



క్రేన్ సాయంతో వినాయక విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న కార్మికులు



ప్రత్యేక వాహనంలో గణనాథులు

# మట్టి విగ్రహాలే శ్రేయస్కరం



బాలాంత్రంలో మట్టి విగ్రహాలను పూజించాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో మట్టి గణపతి విగ్రహాలు అందిస్తున్న డాక్టర్ క్రాంతికుమార్ దంపతులు

కె.గంగవరం: మట్టి విగ్రహాలే శ్రేయస్కరమని, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే పూజించాలని బాలాంత్రం ప్రాథమిక పాఠశాల, కోటిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్ఎం నరాల కృష్ణకుమార్, ఉపాధ్యాయిని దుర్గాదేవి తదితరులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలని కోరారు. కోటిపల్లిలో విద్యార్థులే స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందించారు.

**విద్యార్థులకు మట్టి విగ్రహాలు**

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జనవిజ్ఞాన వేదిక రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు, ద్రాక్షారామ దంత వైద్యుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతికుమార్ సతీమణి నాగ శేషుకుమారి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ద్రాక్షారామ ఎస్సై బి. వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గుణ్ణం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హసన్‌బాదలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

**రామచంద్రపురంలో..**

రామచంద్రపురం: పట్టణంలోని జగద్గురు జయేంద్ర సరస్వతి సన్‌షైన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ శిరిగినీడి సురేష్, డైరెక్టర్లు ఎస్.నందు, ఎస్.సతీష్, ప్రిన్సిపాల్ ఎం.వెంకట్రావు, హెచ్ఎం సీహెచ్ సురేష్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.

## ఆత్మీయ స్వాగతం





వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా నిడదవోలుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మంత్రి చెల్లుబోయిన వేణు

# ఎమ్మెల్సీ తోటకే 'కాపు' కాస్తాం

- మండపేట కాపు సంఘం నేతల స్పష్టీకరణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా తదితరులు

మండపేట: కాపు జాతి నేతగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకే తాము కాపు కాస్తామని మండపేట కాపు అభ్యుదయం సంఘం నేతలు తెలిపారు. కాపుజాతి ముద్దుబిడ్డ వంగవీటి రాధాను అంతమొందించిన, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై దాడి చేసిన టీడీపీకి కొమ్ము కాసేది లేదని స్పష్టం చేశారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం సంఘ అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, నాయకులు మెండు బాపిరాజు, యాళ్ల శ్రీనివాస్, ముక్కా సుబ్రహ్మణ్యం తదితరులు మీడియాతో మాట్లాడారు. కాపు ఉద్యమం సందర్భంగా ముద్రగడ, అతని కుటుంబంపై పోలీసు బూటు కాళ్లతో తన్నడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలో పాల్గొన్న వేలాది మందిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను కాపులు ఎప్పటికి మర్చిపోరన్నారు. నాటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎత్తివేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. వంగవీటి రాధాను అతి కిరాతకంగా అంతమొందించిన టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం సరికాదన్నారు. పవన్‌కల్యాణ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే సంఘంలో చర్చించి కాపులంతా ఆయనకు మద్దతు తెలియజేస్తామన్నారు. మండపేటలో కాపు తెగలన్ని ఒకే కుటుంబంగా కలిసిమెలిసి జీవిస్తుంటే కాపు సంఘం నాయకుడిగా చెప్పుకుంటున్న టీడీపీకి చెందిన వాదా ప్రసాదరావు కాపులు, తూర్పు కాపుల పేరిట చిచ్చుపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఆయన పెట్టిన పోస్టులను వారు చూపించారు. కాపుజాతి నేతగా కాపుల అభ్యున్నతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఎవరు ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా తామంతా తోట వెంటే ఉంటామని వారు స్పష్టం చేశారు. సంఘనాయకులు శెట్టి నాగేశ్వరరావు, పులగం శ్రీనివాస్, లేగా పండు, మీసాల రమణ, పేపర్తి సత్యనారాయణ, సిద్దిరెడ్డి రామకృష్ణ, తణుకు అశోక్, శాఖా సత్యనారాయణ, రెడ్డి రత్తయ్య, లంక రాము, సాధనాల శివభగవాన్, కోళ్ల శ్రీనివాస్, శెట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు కృతజ్ఞతలు



ఆలయం వద్ద మాట్లాడుతున్న సంఘ నాయకులు

రామచంద్రపురం రూరల్: విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించినందుకు ద్రాక్షారామ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ద్రాక్షారామ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సంఘ అధ్యక్షుడు కొసనా భీమాశంకరం, ఉపాధ్యక్షుడు టేకి వెంకటప్రసాద్, కోశాధికారి ధవిళేశ్వరపు దుర్గాప్రసాద్, గౌరవ సలహాదారులు గారోజు సూరిబాబు, కొసనా కామేశ్వరరావు, ఆలయ ధర్మకర్త దమరసింగు సత్యవతి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రికి, సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలకు విశ్వబ్రాహ్మణుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ మేరకు ఆలయం వద్ద ఆదివారం ఉదయం 7 గంటలకు విశ్వకర్మ పతాకావిష్కరణ, ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మండపేట: ఐక్య పోరాటాలతోనే ఐసీడీఎస్ రక్షణ, వేతనాల పెంపు, ఇతర అంగనవాడీ డిమాండ్లు సాధించగలమని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంగనవాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి అధ్యక్షతన శనివారం స్థానిక డొక్కా సీతమ్మ మహిళ స్త్రీశక్తి భవనంలో జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి మాట్లాడిన ఉదయ నిధి స్టాలిన్‌పై బీజేపీ నాయకులు మాటల యుద్ధం చేస్తున్నారన్నారు. మణిపూర్ ఘటనపై స్పందించని ప్రధాని సనాతన ధర్మంపై గొంతు చించుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలో అక్టోబర్ 11, 12 అంగన్‌వాడీ సభలతో పాటు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బేబిరాణి కోరారు. సీఐటీయూ నాయకులు ఎం.బలరాం, జి.దుర్గాప్రసాద్, వీర్రాజు, పి.వెంకటలక్ష్మి, చంద్రావతి, కె.వెంకటలక్ష్మి, డి. ఆదిలక్ష్మి, ఎం. దుర్గమ్మ, ఎస్. దుర్గా మహేశ్వరి, ఎం. బేబీ, బి. బేబీ, గంగారత్నం, సీహెచ్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రతిమలను పరిశీలిస్తున్న రామచంద్రరావు, ఉపాధ్యాయులు



పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రసంసా పత్రాలు అందించిన ఫణి తదితరులు

మండపేట: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎంఈఓ ఎస్.రామచంద్రరావు అన్నారు. స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకతను గురించి వివరించారు. నేషనల్ గ్రీన్‌కార్ప్స్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, పర్యావరణరహిత వినాయక ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయా పోటీల్లోని విజేతలకు ఎంఈఓ రామచంద్రరావు, హెచ్ఎం సీహెచ్ శోభావళి, నేషనల్ గ్రీన్‌కార్ప్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ మేకా రామలక్ష్మిలు బహుమతులు అందజేశారు. సీఆర్పీ శేషారావు, ఉపాధ్యాయులు నాగుమల్లి ప్రసాద్, రోజాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఓజోన్ పొరను పరిరక్షించుకుందాం**

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాల వద్ద శనివారం ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓజోన్ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఫణి హాజరయ్యారు. తొలుత గ్రామంలో ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఓజోన్ పొర అంశాలపై జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించిన గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రసంసా పత్రాలు అందించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నాగరాజు, ఆంజనేయులు, సంగీతం రామకృష్ణ, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ పోషణ మాసోత్సవాలు

మండపేట: కేశవరం దేవుడుతాళ్లు కాలనీలోని 281 అంగనవాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ మాసోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అంగనవాడీ కార్యకర్త తానింకి ఇందిర ఆధ్వర్యంలో తల్లులు రకరకాల పిండి వంటలు తయారుచేసి కార్యక్రమంలో ప్రదర్శించారు. చిరుధాన్యాలు, పండ్లు, రకరకాల కూరగాలు, పోషకాహార పదార్థాలను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది అనంత, కె.ప్రజ్ఞ, ఆశ కర్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామ అంగన్‌వాడీలు నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ దాసి మీనాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చేంబ్రోలు వీరభద్రరావు, కార్యదర్శి తాతపూడి సుభాకర్ అతిథులుగా హాజరై మాట్లాడారు. గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు.

# వైఎస్సార్ సీపీతోనే కాపుల సంక్షేమం



తొగరు మూర్తి

రామచంద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా కాపులు జీవితాలలో వెలుగులు నింపారని ఆ పార్టీ నియోజవర్గ కాపు కాంక్షేమ సంఘం అధ్యక్షుడు తొగరు మూర్తి తెలిపారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. కాపు నేస్తం పథకం ద్వారా రాష్ట్రంలో మూడు లక్షల 57 వేల మంది కాపు మహిళలకు వినాయక చవితి కానుకగా రూ.15 వేల రూపాయలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.536 కోట్లు అందించారన్నారు. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా కాపు మహిళల అభివృద్ధికి దళారీ వ్యవస్థ లేకుండా నాలుగేళ్లలో కాపు మహిళలకు రూ.2029 కోట్ల వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి ముఖ్యమంత్రి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారన్నారు. నియోజవర్గంలో దశాబ్దాల కాలంగా ఇంటి స్థలం లేక కొన్ని వందల కాపుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి కాపు కుటుంబానికి ఇళ్ల స్థలాల పట్టాలు, టిడ్కో ఇళ్లు మధ్యవర్తులు లేకుండా అందజేశారన్నారు. టీడీపీ నాయకులు కాపుల మీద, కాపు నాయకులపై చూపిన అరాచకాన్ని ఎవ్వరూ మర్చిపోలేదన్నారు. వైయస్సార్ సీపీకి తెలగా బలిజ ఒంటరి తూర్పు కాపు కులాల ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని తొగరు మూర్తి తెలిపారు.

### క్రీడలతో మంచి భవిష్యత్తు

కాజులూరు: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కాజులూరు జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి పాఠశాల క్రీడా పోటీల ఎంపికలు నిర్వహించారు. ఖ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20వ తేదీన రామచంద్రపురంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఎంపికల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, ఎంఈఓలు కె.వివేకానంద, పి.జాన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఔత్సాహిక వ్యాపారస్తులకు ఆర్టీసీ అవకాశం

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలోని ఔత్సాహిక వ్యాపారస్తులు ఆర్టీసీ డిపో వద్ద గల ఖాళీ స్థలం, కె.గంగవరం బస్టాండ్ వద్ద ఉన్న షాపులో వ్యాపారానికి అనుమతిస్తున్నట్టు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం సీల్డ్ టెండర్లు సమర్పించాలన్నారు. డిపో కార్యాలయం వద్ద ఈ నెల 21వ తేదీ వరకు రూ.295 చెల్లించి దరఖాస్తులు పొందవన్నారు. పూర్తి చేసిన టెండరు ఫారాలు 22వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టెండరు బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరిచి అధికంగా నమోదు చేసిన వారికి హక్కు కల్పిస్తారన్నారు. మరింత సమాచారం కోసం 99592 25536, 73829 14010 ఫోన్ నవంబర్లకు సంప్రదించాలని కోరారు.

### అభివృద్ధి పనులకు భూమిపూజ

రాయవరం: సోమేశ్వరంలో శనివారం అభివృద్ధి పనులకు సర్పంచ్ ఆరిఫ్ భూమిపూజ చేశారు. స్థానిక వెంకన్న గుడి వీధిలో శాకా అన్నవరం ఇంటి నుంచి కఠారి సూరిబాబు ఇంటి వరకూ నిర్మించే సిమెంట్ రహదారి, డ్రైనేజీ నిర్మాణ పనులు రూ.7లక్షలతో చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల నుంచి మట్టి సేకరణ

మండపేట: స్వాతంత్ర్య అమృతోత్సవ్ ముగింపు సందర్భంగా బీజేపీ నిర్వహిస్తున్న నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆ పార్టీ నాయకులు ఆలయాల వద్ద నుంచి మట్టిని సేకరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కో కన్వీనర్ కేవీవీ సాయిరాం, శివప్రసాద్ తదితరులు మండలంలోని అర్తమూరు, పేకేటిపాకలు, ద్వారపూడి, చినద్వారపూడిలోని పవిత్ర ఆలయాల వద్ద నుంచి కలశాల్లో ఈ మన్నును సేకరించారు.

### జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. అంగరలో శనివారం వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునుడు మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి తాతపూడి సుభాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### మండపేటలో టీడీపీకి షాక్



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యాంద్ర బుజ్జి, చిత్రంలో ఎమ్మెల్సీ తోట

మండపేట: మండపేటలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గం ముఖ్య నేత, మాజీ కౌన్సిలర్ భర్త యాంద్ర ప్రభాకరరావు (బుజ్జి) శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిడదవోలు కాపునేస్తం కార్యక్రమం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బుజ్జికి సీఎం జగన్ పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పని చేయాలని సూచించారు. అనంతరం బుజ్జి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజారంజక పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వానికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఫ్యాక్టరీ కాలుష్యంపై అధికారుల పరిశీలన

మండపేట: పట్టణంలోని సంఘం కాలనీలో గల ఒక ఫ్యాక్టరీ నుంచి కాలుష్యం వెలువడుతోందని స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం అధికారులు పరిశీలన చేశారు. కాలనీ పక్కనే ఉన్న లే అవుట్ స్థలంలో రాజస్తాన్‌కు చెందిన కొందరు డోర్స్ తయారీ ఫ్యాక్టరీని నడుపుతున్నారు. ఈ పరిశ్రమ నుంచి వెలువడుతన్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం స్థానికులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి పరిశీలనకు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, ఎంపీడీఓ ఐ.రాజు ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. యజమాని స్థానికంగా లేరని సిబ్బంది చెప్పడంతో అనుమతులు చూపే వరకు పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, స్థానికులు ముమ్మిడివరపు ఆదినారాయణ, వేమగిరి మోషే, గుడాల ఏసురత్నం, బంగారయ్య, సూరిబాబు, త్రిమూర్తులు, ఏడిద ఏసు తదితరులు పాల్గొన్నారు.

### అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే పరీక్షల నిర్వహణ

రాయవరం: ఇంటర్మీడియెట్ బోర్డు ముందుగా ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం పరీక్షల నిర్వహణ సజావుగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న యూనిట్-3 పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 12 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. యూనిట్ పరీక్షలను కూడా పబ్లిక్ పరీక్షల మాదిరిగా నిర్వహించినప్పుడే ఫైనల్ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోగలమన్నారు. పరీక్షలు జరుగుతున్న తీరును ప్రిన్సిపాల్ దారపు నాగేశ్వరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.